క్లుప్తంగా

వంద రోజులు పని కల్పించాలని వినతి



అవురిపూడి (మొవ్వ): మండలంలోని అవురుపూడి పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం కింద పనులు వంద రోజులు కల్పించాలని కోరుతూ సచివాలయంలో ఇన్‌చార్జ్ ఈవో ప్రత్యూషకు వినతిపత్రాన్ని కూలీలు, నాయకులు అందజేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు, డీ రాధాకృష్ణ, నాయకులు జొన్నలగడ్డ భాస్కర రావు, మేట్లు కే లక్ష్మీ నాంచారమ్మ, కే పార్వతి, డీ నాగలక్ష్మి, ఎస్.రజిని, ఎస్.నారాయణ, ఉపాధి కార్మికులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం



గుడ్లవల్లేరు: బ్యాంకు ఉద్యోగుల సంక్షేమమే తమ సంఘ ధ్యేయమని కెనరా బ్యాంకు ఉద్యోగుల సంఘ రాష్ట్ర నాయకుడు సీహెచ్. అభయాంజనేయస్వామి అన్నారు. కెనరా బ్యాంకు ఉద్యోగుల సంఘం ఏర్పడి 73 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా అంగలూరు కెనరా బ్యాంకులో బుధవారం మేనేజర్ కె.విజయ్‌కుమార్ కేక్ కట్ చేశారు. అనంతరం ఖాతాదారులకు స్వీట్లు, కేకులు పంచిపెట్టారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

ధ్వజ స్తంభం ఊరేగింపు



పామర్రు: స్థానిక తోటలోని శ్రీ కోదండ రామాలయంలో గురువారం ఉదయం నూతన ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈనేపథ్యంలో బుధవారం గ్రామ వీధుల్లో నూతన ధ్వజ స్తంభాన్ని మేళ తాళాలతో, హరి నామ సంకీర్తనలతో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ గురువారం ఉదయం 9.18 నిమిషాలకు రామాలయంలో శిఖర ప్రతిష్ఠ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ ప్రతిష్ఠ అనంతరం అన్న సమారాధన కార్యక్రమం జరుగుతుందని వివరించారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ



గుడివాడ టౌన్: వాసవీక్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో బుధవారం బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన 30 రోజుల మజ్జిగ పంపిణీలో భాగంగా స్థానిక మెయిన్‌రోడ్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు జవ్వాజి గంగరాజు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్లబ్ సభ్యులు చేస్తున్న సేవ అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో వాసవీక్లబ్ అధ్యక్షుడు తిరివీధి వెంకట సుబ్బారావు, కోశాధికారి ఎక్కల మణిదీప్, ఉపాధ్యక్షుడు మునగ గంగాధర్‌రావు, జాయింట్ సెక్రటరి సురేష్‌కుమార్, వాసవి పరివార్ సభ్యుడు శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్ర అదనపు చార్జీలపై సీఎం నిర్ణయం హర్షణీయం

కోనేరుసెంటర్: హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు అయ్యే అదనపు ఖర్చులను ప్రభుత్వమే భరించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షణీయమని వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ జోనల్ ఇన్‌చార్జి, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్‌సిలార్‌దాదా అన్నారు. పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఏపీ నుంచి హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు తెలంగాణ ప్రభుత్వంతో పోలిస్తే రూ.80 వేలు అదనంగా ఖర్చు అవుతుందన్నారు. ఈ ఖర్చును ప్రభుత్వమే భరించేలా నిర్ణయం తీసుకోవటం పట్ల రాష్ట్రంలోని ముస్లింలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాయన్నారు. దీనిపై ప్రతిపక్షాలు రాజకీయం చేస్తూ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. జిల్లా అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ.. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 2,260 మంది ముస్లింలు హజ్ యాత్రకు వెళ్లేందుకు సిద్ధమయ్యారన్నారు. గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి హజ్‌కు వెళ్లే విమానాలకు టెండర్ దక్కించుకున్న సంస్థ విమానాల టిక్కెట్ ధరను పెంచిందని పేర్కొన్నారు.

తడిసిన పంటను కొనుగోలు చేస్తాం

పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



బోరగుడిలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పామర్రు(పమిడిముక్కల): అకాల వర్షాలతో పంటలు నష్ట పోయిన అన్నదాతలను అన్ని విధాలా ఆదుకుంటామని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. పమిడిముక్కల మండలం బోరగుడి గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్ద మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. అనంతరం రైతులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ పంటనష్ట పోయిన ఏ ఒక్క రైతు పరిహారం అందలేదని, పంటలు కొనుగోలు చేయడం లేదన్న మాటే రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షాలకు పాడైన, తడిసిన, మొలకలు వచ్చిన జొన్న పంటను పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తారని తెలిపారు. రైతులు ఎవరూ అధైర్య పడవద్దని, అండగా ప్రభుత్వం ఉన్నదని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అకాల వర్షాలకు దెబ్బ దిన్న స్టాండింగ్ క్రాఫ్ (పంట కొయ్యని) ఎన్యూమరేషన్ త్వరితగతిన పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో మొక్కజొన్న క్వింటా రూ.1960 వంతున కొనుగోలు చేస్తారని తెలిపారు. ఎంపీటీసీ మర్రి దుర్గా రావు, సర్పంచ్ కందిమళ్ల పూర్ణకుమారి, మొవ్వ ఏఎంసీ వైస్ చైర్మన్ కొడాలి రాంబాబు, మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శిలు యలమంచిలి గణేష్, మారపాక మహేష్, మండల సచివాలయ కన్వీనర్ పరసా జగన్, పీఏసీఎస్ అధ్యక్షులు మర్రి మల్లికార్జునరావు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు కొణతం శ్రీనివాసరావు, ఆర్‌బీకే చైర్మన్ బాసు రమేష్, పార్టీ నాయకులు మర్రి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు, సర్టిఫికెట్ల పంపిణీ

పామర్రు: ప్రతి మహిళా ఆర్థికాభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక కంచర్ల వానిపురంలో వర్డ్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. మహిళలకు సంస్థ ద్వారా ఉచితంగా కుట్టు శిక్షణా తరగతులు నిర్వహించి, కట్టు మిషన్లు ఉచితంగా అందజేయటం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా వర్డ్ సంస్థ ఫౌండర్, ప్రెసిడెంట్ జోబ్ స్టాలిన్, ఆశాలతలు మాట్లాడుతూ సంస్థ ద్వారా గత ఆరు నెలలుగా మహిళలకు కుట్లు అల్లికలలో ఉచిత శిక్షణ, ఉచితంగా మిషన్లను పంపిణీ చేశామని అన్నారు. మహిళలకు కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. మచిలీపట్నం డిప్యూటీ మేయర్ బందెల కవిత థామస్, థామస్ నోబుల్, గ్రామ సర్పంచ్ కె.కస్తూరి, వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఏ రమాదేవి, కో ఆప్షన్‌సభ్యులు ఎండీ హస్మతుల్లా, విజయవాడ కృష్ణా మిల్క్ యూనియన్ జిల్లా బోర్డు సభ్యుడు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ బాల వెంకటేశ్వరరెడ్డి, మండల రైతు సలహా మండలి అధ్యక్షుడు ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, వార్డు మెంబర్లు ఆరేపల్లి శ్రీహరి, పార్టీ నాయకులు నందిపు వెంకట నాంచారయ్య, డీడీ ప్రసాద్, దాసి మల్లికార్జునరావు, కూనం పెద వెంకటరెడ్డి, స్థానిక నాయకులు తలారి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

క్రీస్తుమార్గం అనుసరణీయం

పామర్రు(తోట్లవల్లూరు): ప్రభువైన ఏసు క్రీస్తు చూపిన మార్గం అనుసరణీయమని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. తోట్లవల్లూరు మండలం యాకమూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన చర్చిని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో ప్రభువైన క్రీస్తు ఆశీస్సులతో మరలా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉండాలని అందరూ ప్రత్యేక ప్రార్ధనలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు, క్రీస్తు విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు



జ్ఞాపికలు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

పామర్రు: ఘంటసాల కళాపీఠం ఆద్వర్యంలో 2022–23 ఏడాది పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పది మంది విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను బుధవారం అందజేశారు. కళాపీఠం అధ్యక్ష ఉపాధ్యక్షుడు కాటూరి వెంకట మురళీ కృష్ణ, కోటి పాండురంగారావు వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువుని మరింత ప్రొత్సహించేందుకు 10 మంది విద్యార్థులకు ఈ పురస్కారాలను ఇచ్చామన్నారు. పామర్రు పమిడిముక్కల ఎంఈవోలు పి.విజయలక్ష్మి, శ్రీనివాసరావు, విశ్రాంత ఏఎస్‌పీ సాయిన సుశీలరావు, ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల, హితమ్ స్కూల్ ప్రిన్సిపల్ ఎస్.హేమంతరెడ్డి, విశ్రాంత ఉద్యోగి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన విద్యుత్ కనెక్షన్ రిజిస్ట్రేషన్లు



రిజిస్ట్రేషన్‌లకు క్యూ కట్టిన మహిళలు

గుడివాడ టౌన్: నూతనంగా నిర్మించిన టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు విద్యుత్ కనెక్షన్ల రిజిస్ట్రేషన్లు బుధవారం ప్రారంభించారు. తొలిరోజు 110 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు పూర్తయినట్లు విద్యుత్ శాఖ డీఈఈ టీ రామకృష్ణ తెలిపారు. లబ్ధిదారులకు కావలసిన దరఖాస్తులు ప్రతి సచివాలయంలోనూ, విద్యుత్ సబ్ స్టేషన్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. ముందుగా దరఖాస్తులు తీసుకుని పూర్తిచేసి దానికి ఫొటో జతచేసి ఇచ్చినట్లయితే రిజిస్ట్రేషన్ పనులు సులువుగా ఉంటుందని ఆయన సూచించారు. పురపాలక సంఘం జారీ చేసిన ఎలాట్‌మెంట్ పత్రంతో పాటు ఆధార్‌కార్డు, సెక్యూరిటీ డిపాజిట్ రూ.400, దరఖాస్తు రుసుం రూ.50 చెల్లించి రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలన్నారు. లబ్ధిదారులు విద్యుత్ శాఖ ఉద్యోగులకు సహకరించాలని ఆయన కోరారు.

మినరల్ వాటర్ ప్లాంటు ప్రారంభం

మొవ్వపాలెం(మొవ్వ): సొంత ఊరిని మరువకుండా ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్య మిస్తున్న దాతలు అభినందనీయులని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పేర్కొన్నారు. మొవ్వ మండలం మొవ్వపాలెం గ్రామంలో శ్రీ చలమలశెట్టి గంగయ్య చారిటబుల్ ట్రస్టు నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామ ప్రయోజనాల కోసం రూ6.5 లక్షల వ్యయంతో మినరల్ ప్లాంట్ నిర్మించటమే కాకుండా మరెన్నో సేవాకార్యక్రమాలు చేస్తున్న ట్రస్ట్ సభ్యులు మరింత ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు చలమలశెట్టి వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ శివకుమారి దంపతులను, చలమలశెట్టి నరేష్‌లను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, ఎంపీపీ కొండేటి ఇందిర, పార్టీ మండలాధ్యక్షులు రాజులపాటి రాఘవరావు, పార్టీ నాయకులు గోగినేని పెరుమాళ్ళు, మంద శ్రీనివాసరెడ్డి, మండవ రత్నగిరి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విలువలను అలవర్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల తదితరులు

కైకలూరు: ప్రతి ఒక్కరూ మానవత విలువలను అలవర్చుకుని పేదలకు సేవ చేయాలని మానవత స్వచ్ఛంద సంస్థ ఏలూరు మండల చైర్‌పర్సన్ అడుసుమిల్లి నిర్మల అన్నారు. కొండ్రెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో కైకలూరులో నూతన సంఘ ఏర్పాటు నిమిత్తం ప్రముఖులతో సమావేశం బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా సంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కై కలూరులో నూతన సంఘంగా ఏర్పడి పేదలకు సహాయం చేయాలని కోరారు. నియోజకవర్గ క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు పేరిచర్ల రామరాజు, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంటు రాంబాబు, మాజీ ఎంపీపీ నర్సిపల్లి అప్పారావు, ఏఈ శ్రీనివాసచౌదరి, జంపన రామలింగరాజు, న్యాయవాది వడ్లాని శ్రీరామచంద్రమూర్తి, రిటైర్డ్ ఎస్ఐ సత్యనారాయణ, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ పీడీ ఎస్‌డీవీ సత్యనారాయణ, బూరుబోయిన మోహనరావు, కొనిజేటి శ్రీనివాసరావు, కలిదిండి మండల మానవత స్వచ్ఛంద సంస్థ పేటేటి వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మానసిక ఉల్లాసం



చదవడం మాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులు

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పుస్తకాలు చదవడం మాకిష్టం కార్యక్రమాలు బుధవారం జరిగాయి. పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. వేసవిలో విద్యార్థుల్లో మానసికోల్లాసాన్ని, విజ్ఞానాన్ని పెంచేందుకు పుస్తక పఠనం అలవాటు చేసేందుకు విద్యాశాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. వీటితో పాటు విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ పాఠశాలల సంసిద్ధత వంటి కార్యక్రమాలను నిర్వహించారు. చినకామనపూడి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామోజీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బడి ఈడు పిల్లల ఇళ్ల వద్దకు వెళ్లి తల్లిదండ్రుల్లో చైతన్యం కల్పించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ముదినేపల్లి శాఖా గ్రంథాలయంలో పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారిణి ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం

మండవల్లి: మండలంలోని అయ్యవారిరుద్రవరంలో కొలువై ఉన్న శ్రీసాంబ సదాశివస్వామి ఆలయ పునఃనిర్మాణ పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. కళాపకర్షణ పూజాది కార్యక్రమాలు, ప్రముఖ శైవాగమ పండితుడు బ్రహ్మశ్రీ పుల్లేటికుర్తి భోగేశ్వరశర్మ యాజ్ఞీకత్వంలో నిర్వహించారు. ఏర్పాట్లను ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

14న హనుమాన్ శోభాయాత్ర

కైకలూరు: విశ్వ హిందూ పరిషత్, కైకలూరు ప్రఖండ ఆధ్వర్యంలో ఈ నెల 14న సాయంత్రం 4 గంటల నుంచి చావలిపాడు నుంచి ఆటపాక వరకు హనుమాన్ శోభాయాత్ర, భక్తి పూర్వక బైక్ ర్యాలీ జరుగుతుందని హిందూ భక్తులు బుధవారం తెలిపారు. హనుమజ్జయంతి సందర్భంగా ర్యాలీ ఏర్పాటు చేశామన్నారు. హిందూ సంస్థలు, బంధువులు తప్పక హాజరు కావాలని కోరారు.

ఆవు ప్రాణాలు కాపాడిన సంచార వాహన సిబ్బంది

కై కలూరు: గర్భాశయ సమస్య (మెయ్య) ఉన్న గోవుకు శస్త్రచికిత్సచేసి ప్రాణాలు నిలబెట్టారు కైకలూరు పశుసంచార వైద్య వాహన సిబ్బంది. స్థానిక కుమ్మరివీధిలో బుధవారం ఆరేళ్ల వయస్సున్న గోవుకు గర్భాశయం బయటకు వచ్చి నడవలేని స్థితికి చేరింది. స్థానికులు పశుసంచార వైద్య వాహన టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేశారు. దీంతో వెటర్నరీ డాక్టరు పవన్, అసిస్టెంటు మహేష్, ల్యాబ్ టెక్నిషియన్ మనోజ్‌లు వచ్చి బయటకు వచ్చిన మెయ్యను లోపలికి పంపించి శస్త్ర చికిత్స చేశారు. ఓఎస్ శ్రీను, డ్రైవర్ మణికంఠ సాయమందించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మనుషులకే కాదు, పశువులకు సైతం అందిస్తున్న సంచార వైద్య సేవలను గ్రామస్తులు ఈ సందర్భంగా అభినందించారు.

వైద్య పరీక్షలు

గుడ్లవల్లేరు: స్థానిక శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమం కింద బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య రక్షణకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అభయాంజనేయుని గ్రామోత్సవం

భావదేవరపల్లి(నాగాయలంక): హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా గ్రామంలోని శ్రీఅభయ ఆంజనేయస్వామి ఆలయం ఆధ్వర్యంలో బుధవారం గ్రామోత్సవం, ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ నిర్మాణకర్త మలిశెట్టి సాంబశివరావు(నామాలు) పర్యవేక్షణలో నాంచారయ్య నేతృత్వంలో ఉత్సవం ఆరంభం సందర్భంగా ఆకుపూజ, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక భజన బృందం నేతృత్వంలో హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. మలిశెట్టి బాలాంజనేయులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు. ఐదు రోజుల పాటు ఉత్సవ పూజలు జరుగుతాయన్నారు.

సీఎం సభాస్థలిలో ఏర్పాట్ల పరిశీలన



కోనేరుసెంటర్: బందరు పోర్టు నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సభాస్థలి ఏర్పాట్లను వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కిట్టు అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించి సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. గ్యాలరీలను, పైలాన్‌ను పరిశీలించారు. కార్యక్రమ ఏర్పాట్లు వేగవంతంగా జరపాలని తెలిపారు. కార్యక్రమంలో బందరు నియోజకవర్గం కన్వీనర్లు శీలం మారుతీరావు, చిటికెన నాగేశ్వరరావు, కార్పొరేటర్ మేకల సుబ్బన్న, గాజుల భగవాన్ పాల్గొన్నారు.

మైక్రో ఫిల్టర్ల ఏర్పాటు అభినందనీయం

ఎమ్మెల్యే డీఎన్నార్



కొండంగి గ్రామలో మైక్రో వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు (కలిదిండి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేసేందుకు మండల పరిషత్, పంచాయతీ నిధులతో మైక్రో ఫిల్టర్లు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చెప్పారు. కొండంగి గ్రామంలో మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన మైక్రో వాటర్ ఫిల్టర్‌ను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం గ్రామ శివారు పల్లెపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన డ్రెయిన్లను పరిశీలించారు. గ్రామ స్థాయిలో మైక్రో వాటర్ ఫిల్టర్ల ఏర్పాటుకు నిధులు అందించిన మండల పరిషత్ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, మండల వ్యవసాయ మార్కెట్ అధ్యక్షులు ఐయినాల బ్రహ్మాజీరావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు తిరుమాని రమేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ పామురవికుమార్, వైస్ ఎంపీపీ కూసంపూడి కనక దుర్గా రాణి, ఎంపీటీసీ సభ్యులు ఇమ్మనేని లక్ష్మణరావు, సర్పంచ్ తిరుమలశెట్టి జ్యోతి, నాయకులు పడవల శ్రీను, తిరుమలశెట్టి సుబ్రహ్మణ్యం, బోడిగడ్డ కిషోర్, కొల్లాటి నాగరాజు, బొమ్మిడి జనార్దనరావు, మండా నవీన్, బొర్ల సురేష్, కోక లోకేష్, తిరుమాని నాగార్జున, తెనాలి సామియేలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగబాబు, పంచాయతీ కార్యదర్శి జి.శివన్నారాయణ, గంగాధరరావు, పార్టీ అభిమానులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

యువత క్రీడలపై మొగ్గు చూపాలి

గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్



బ్యాటింగ్ చేసి క్రీడలు ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీకాంత్

గుడివాడ టౌన్: ఖాళీ సమయాల్లో యువత క్రీడలపై ఆసక్తి చూపాలని గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం ప్రారంభమైన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం యువత సమయాన్ని వృథాగా గడుపుతున్నారన్నారు. స్టేడియం కమిటి ఉపాధ్యక్షుడు పాలేటి శివ సుబ్రహ్మణ్యేశ్వరరావు (చంటి), సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్, కమిటి సభ్యులు బొగ్గారపు తిరుపతయ్య, వల్లభనేని ప్రసాదు, ప్రవీణ్ కుమార్, డి.రవికుమార్, కె రంగప్రసాద్, నెరుసు శేషగిరిరావు, పిన్నమనేని వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు. పోటీల్లో ఏలూరు జమ్స్ జట్టు గుడివాడ ముబారక్ జట్టుతో తలపడగా నిర్ణీత 20 ఓవర్లలో 241 పరుగులు సాధించగా గుడివాడ జట్టు 94 పరుగులకు ఆల్ అవుట్ అయింది. రెండో ఆటలో విజయవాడకు చెందిన ఫ్రెండ్స్ జట్టు స్టార్ కింగ్స్ 11 పోటీపడగా ఫ్రెండ్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 157 పరుగులు చెయ్యగా స్టార్ కింగ్స్ జట్టు 73 పరుగులకు ఆల్ అవుట్ అయ్యారు.

గ్రంథాలయాల్లో శిక్షణను వినియోగించుకోవాలి



జమీగొల్వేపల్లిలో తాము వేసిన చిత్రాలను చూపుతున్న విద్యార్థులు



అంగలూరులో పుస్తక పఠన పోటీలు నిర్వహిస్తున్న లైబ్రేరియన్ పద్మజ



కైకలూరు గ్రంథాలయంలో వేసవి శిక్షణలో చిన్నారులు

గుడ్లవల్లేరు: పుస్తకం హస్త భూషణమని పుస్తకాలతో విద్యార్థుల్లో జ్ఞానం ఏర్పడుతుందని గ్రంథాలయాధికారులు పి.వి.వి.పద్మజ, వాణి అన్నారు. బుధవారం అంగలూరు, గుడ్లవల్లేరు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠన పోటీలను చేపట్టారు. విజ్ఞాన శిబిరాల పేరిట వేసవి సెలవుల్లో విద్యార్థులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి తమ పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారని గ్రంథాలయాధికారులు తెలిపారు.

మండవల్లి: మండవల్లి గ్రేడ్–3 గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం బుధవారం మూడో రోజు కొనసాగింది. పుస్తక పఠనం విద్యార్థులను ఉన్నత శిఖరాలు అందుకోవడానికి దోహదం చేస్తుందని సర్పంచ్ మెండా ఝాన్సీ పేర్కొన్నారు. గ్రంథాలయంలో పస్తకాలు చదివి సీహెచ్ యువసాయి 10వ తరగతి పరీక్షల్లో డివిజన్ స్థాయిలో 585 మార్కులు సాధించి అందరి మన్ననలను పొందుతున్నాడని తెలిపారు. గ్రంథాలయాధికారి షేక్ పర్వీన తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు

పామర్రు(జమీగొల్వేపల్లి): చిత్రలేఖనం వలన విద్యార్థులలో సృజనాత్మకత పెంపొందుతుందని గ్రంథాలయ అధికారి వి.నాగ సురేష్ అన్నారు. మండల పరిధిలోని జమీగొల్వేపల్లిలోని శాఖ గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు చిత్ర లేఖనంపై పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషాదేవి, పద్మావతి, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కైకలూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఆర్.రాఘువులు నిర్వహణలో బుధవారం చిన్నారులకు ఆటలు, నృత్యాలు, పుస్తక పఠనం చేయించారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కథలు, పుస్తక పఠనం, చిత్రలేఖనం, పుస్తక సమీక్షలు, పేపర్ అర్ట్స్ వంటి అంశాలలో బాలబాలికలకు శిక్షణ అందిస్తామన్నారు. శిక్షణ చివరి రోజున బహుమతులు, ధ్రువపత్రాలు అందిస్తామని చెప్పారు.

వృద్ధులకు కంటి, దంత పరీక్షలు



మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సంఘ కార్యాలయంలో ఉచిత నేత్ర, దంత వైద్యశిబిరం నిర్వహించారు. రాజమండ్రి గౌతమి నేత్రాలయం ఆధ్వర్యంలో 25 మందికి పరీక్షలు నిర్వహించి ఇద్దరికి శస్త్రచికిత్సలు అవసరమని వైద్యులు నిర్ధారించారు. ప్రతి నెల రెండో బుధవారం ఈ వైద్యశిబిరం సంఘ కార్యాలయంలో నిర్వహిస్తామని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్ తెలిపారు. వైద్యురాలు రమ్య 20 మంది వృద్ధులకు దంత పరీక్షలు నిర్వహించి పేస్టులు, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవరావు, కోశాధికారి శంకరరావు, జాయింట్ సెక్రటరీ బీకె దుర్గారావు పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు సత్కారం

ముదినేపల్లి రూరల్: ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు స్థానిక పోలీసుస్టేషన్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహిస్తామని ఎస్సై షణ్ముఖసాయి బుధవారం తెలిపారు. మండల వ్యాప్తంగా వివిధ పాఠశాలలకు చెందిన 18 మంది విద్యార్థులు పరీక్షల్లో ప్రతిభ చూపారన్నారు. వీరిని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) సత్కరించి సభలో మాట్లాడాతారన్నారు. పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.